TITLE CODE: APTEL16281

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 175 | ఎడిటర్ : ఎం. రమేష్ | ఆదివారం, మే 26, 2024 | పేజీలు : 04 | వెల రూ. 5.00/-

## మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం : ప్రధాని మోదీ

జూన్ 4న మరోసారి మోదీ సర్కారు కొలువుదీరడం ఖాయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఇప్పటికే ముగిసిన ఆరు దశల ఎన్నికల పోలింగ్‌లో దేశం ఈ మేరకు నిర్ణయించిందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ-ఎన్డీయే కూటమి మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. సదుద్దేశాలు, విధానాల కారణంగా బీజేపీ-ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని మూడోసారి ఏర్పాటు చేయాలని దేశం నిర్ణయించుకుందని ఆయన వ్యాఖ్యానించారు ఈ మేరకు ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఇండియా కూటమి మతపరమైనదిగా, కులపరమైనదిగా దేశం అర్థం చేసుకుందని ప్రధాని మోదీ ఆరోపించారు. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించేందుకుగానూ రాజ్యాంగాన్ని మార్చాలని వారు నిర్ణయించుకున్నారని మోదీ ఆరోపించారు. విపక్షాల కూటమి అధికారంలోకి వస్తే ఐదేళ్లలో ఐదుగురు ప్రధానమంత్రులు ఉంటారని, అలాంటి ప్రధానులు దేశాన్ని బలోపేతం చేయగలరా అని ప్రధాని ప్రశ్నించారు. సమాజ్‌వాదీ, కాంగ్రెస్ పార్టీల నేతలు ఓటు బ్యాంకుకే పరిమితమయ్యారని, అయితే మోదీ మాత్రం దేశంలోని పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలకు అంకితం అయ్యారని పేర్కొన్నారు.



## హైదరాబాదులో పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో వర్షం



గత కొన్ని రోజులుగా తీవ్ర ఎండలతో ఇబ్బంది పడుతున్న హైదరాబాద్ వాసులకు ఈ సాయంత్రం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. నగరంలో సాయంత్రం వరకు ఎండ మండిపోగా, సాయంత్రానికి వాతావరణంలో మార్పు వచ్చింది. హైదరాబాదులోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉప్పల్, దిల్ సుఖ్ నగర్, వనస్థలిపురం, సరూర్ నగర్, ఎల్బీ నగర్, నాచారం, హబ్సీగూడ, తుర్కయాంజాల్, నల్లకుంట, కాచిగూడ, మల్కాజ్ గిరి, హయత్ నగర్, పెద్ద అంబర్ పేట్ ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయం కావడంతో ట్రాఫిక్ కు ఇబ్బందులు ఎదురయ్యాయి.

## జమ్మూకశ్మీర్ విషయంలో చేయబోయేది అదే..: అమిత్ షా

- **ప్రస్తుతం జమ్మూకశ్మీర్ లో లోక్ సభ ఎన్నికలు పూర్తి**
- **త్వరలోనే రాష్ట్ర హోదా కల్పిస్తామన్న కేంద్ర హోం మంత్రి**
- **సెప్టెంబర్ 30 నాటికి జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడి**

ఆర్టికల్ 370 రద్దు నాటి నుంచి రాష్ట్రపతి పాలనలో ఉన్న జమ్మూకశ్మీర్ ప్రాంతానికి త్వరలోనే రాష్ట్ర హోదా కల్పిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. లోక్ సభ ఎన్నికల ఆరో విడతలో భాగంగా జమ్మూకశ్మీర్ లోని ఎంపీ స్థానాలకు ప్రశాంతంగా ఎన్నికలు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం కశ్మీర్ విషయంలో అనుసరించిన విధానం సరైనదేనని ఇది నిరూపిస్తోందని చెప్పారు. ఇది ఎన్డీయే ప్రభుత్వం సాధించిన అతి పెద్ద విజయమని వ్యాఖ్యానించారు. లోక్ సభ ఎన్నికల ఆరో విడత పోలింగ్ పూర్తయిన నేపథ్యంలో అమిత్ షా తాజాగా ప్రముఖ వార్తాసంస్థ పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్ కు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. జమ్మూకశ్మీర్ లో లోక్ సభ ఎన్నికలు ప్రశాంతంగా జరగడంపై హర్షం వ్యక్తం చేశారు. లోక్ సభ ఎన్నికల్లో కశ్మీర్ లోని వేర్పాటు వాదులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని ఓటు వేశారని.. అత్యధిక పోలింగ్ శాతం నమోదైందని అమిత్ షా చెప్పారు. ఇది చాలా ముఖ్యమైన పరిణామమని అభివర్ణించారు. జమ్మూకశ్మీర్ ప్రాంతంలో ప్రశాంతంగా, అత్యధిక స్థాయిలో పోలింగ్ జరగడమనేది మోదీ ప్రభుత్వం సాధించిన పెద్ద విజయమన్నారు. తమ ప్రణాళిక ప్రకారం.. జమ్మూకశ్మీర్ లో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన సర్వేలు జరుగుతున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ ఏడాది సెప్టెంబరు 30 నాటికి జమ్మూకశ్మీర్ కు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఇటీవలి లోక్ సభ ఎన్నికల్లో జమ్మూకశ్మీర్ లో బీజేపీ అభ్యర్థిని బరిలోకి దింపకపోవడానికి పలు కారణాలు ఉన్నాయని చెప్పారు. తమ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టామని.. భవిష్యత్తులో తమ అభ్యర్థులను పోటీకి పెడతామని తెలిపారు.



## హైదరాబాదులో అనుమానాస్పద స్థితిలో ఏపీ ఉపాధ్యాయుడి మృతి

లఏపీకి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు హైదరాబాదులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆ ఉపాధ్యాయుడిని రాయచోటికి చెందిన జయప్రకాశ్ గా గుర్తించారు. జయప్రకాశ్ మియాపూర్ లోని ఓయో లాడ్జిలో విగతజీవుడిగా కనిపించాడు. ఉపాధ్యాయుడు జయప్రకాశ్ విషం మాత్రలు మింగినట్టుగా లాడ్జి గదిలో ఆనవాళ్లు కనిపించాయి. ఘటన స్థలిని పరిశీలించిన పోలీసులు హత్యా? ఆత్మహత్యా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

## నెల్లూరులో కౌంటింగ్ నిర్వహణకు అబ్జర్వర్‌ను నియమించాలి : మంత్రి కాకాణి

అమరావతి : నెల్లూరు జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఆధ్వర్యంలో ఓట్ల లక్కింపు సజావుగా సాగుతుందనే నమ్మకం లేదని ఏపీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ) అనుమానం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన నెల్లూరులో మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ పక్షపాత ధోరణిలో పనిచేశారని ఆరోపించారు. ఎన్నికల నిర్వహణలో జిల్లా ఎన్నికల యంత్రాంగం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఈ విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని వెల్లడించారు. జూన్ 4న కౌంటింగ్ నిర్వహణకు ఒక అబ్జర్వర్‌ను నియమించాలని ఆయన కోరారు. పోలీస్ అధికారులను ఉద్దేశ్యపూరితంగా బదిలీ చేసిందని , కొత్తగా బాధ్యతలు చేపట్టిన పోలీస్ అధికారులుఉద్రిక్తతలను రెచ్చగొట్టారని పేర్కొన్నారు. వైసీపీ బలంగా ఉన్న ప్రాంతాల్లో భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. మాచర్ల ఘటన వీడియో ఎలా బయటికి వచ్చిందో చెప్పలేని దుస్థితిలో ఎన్నికల కమిషన్ ఉందని ఆరోపించారు. టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి పట్టపగలు ఓటర్లకు డబ్బులు పంచితే , దానిమీద ఫిర్యాదు చేస్తే ఆర్వో పట్టించుకోలేదని అన్నారు. మానవతా దృకథంతో సోమిరెడ్డి డబ్బులు పంచాడని జిల్లా ఎన్నికల అధికారి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.




### మలేషియా మాస్టర్స్ ఫైనల్‌లో పీవీ సింధు ఓటమి

రెండు సార్లు ఒలింపిక్స్ పతకాలు ముద్దాడిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకి మలేసియా మాస్టర్స్ ఫైనల్ మ్యాచ్‌లో చుక్కెదురైంది. చైనా క్రీడాకారిణి వాంగ్ జీయీ చేతిలో 21-16, 5-21, 16-21 తేడాతో సింధు ఓటమిపాలైంది. మొదటి గేమ్‌లో ఆద్యంతం ఆధిపత్యం కనబరిచిన సింధు.. ఆ తర్వాత రెండు, మూడు గేమ్‌లలో చతికిలపడింది. ముఖ్యంగా రెండో సెట్‌లో 5-21 భారీ వ్యత్యాసంతో వెనుకబడింది. సింధు తప్పిదాలను వాంగ్ జీయీ చక్కగా ఉపయోగించుకుంది. మొదటి గేమ్‌లో తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన సింధు.. రెండో గేమ్‌లో ఆ దూకుడుని ప్రదర్శించలేకపోయింది. ఇక మూడో గేమ్‌ను సింధు దూకుడుగా ఆరంభించినా వాంగ్ జీయీ అద్భుత రీతిలో పుంజుకుంది. చక్కటి ప్లేస్‌మెంట్లు, షాట్లతో రెండు, మూడు గేమ్‌లను సొంతం చేసుకుంది. దీంతో మరో రెండు నెలల్లో ఆరంభం కానున్న పారిస్ ఒలింపిక్స్‌కు ముందు మలేసియా మాస్టర్స్ గెలిచి ఆత్మవిశ్వాసాన్ని సొంతం చేసుకోవాలనుకున్న సింధుకి నిరాశే ఎదురైంది. కాగా టైటిల్ వేటలో సింధుకి మరోసారి నిరాశే ఎదురైంది. గతే రెండేళ్లుగా ఆమె ఎలాంటి టైటిల్స్ గెలవకపోవడం గమనార్హం.

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..





పీపుల్స్ మోటివేషన్ తెలుగు దినపత్రికలో

నియోజకవర్గ ఇంచార్జ్‌లు

మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 80086 22746

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

## అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి వారినిదర్శించుకున్న ప్రముఖులు

- స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది? జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వద్రాణం మార్కండేయబాబు
- ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థుల దే విజయం? గూడూరు సంజీవ రాయుడు
- ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం



**ఆళ్లగడ్డ, మే 26 (పీపుల్స్ మోటివేషన్):-**

ఆళ్లగడ్డ మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి వారిని ఆదివారం రాష్ట్ర జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు పొన్నూరు నియోజవర్గ ఇన్ చార్జి వద్రాణం మార్కండేయ బాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వద్రాణం హరిబాబు, జనసేన గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకట రత్నయ్య తదితరులు దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు, అర్చకులు సాధరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వద్రాణం మార్కండేయబాబు మాట్లాడుతూ, స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థుల దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సిఎం అవుతారని, జన సేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రభుత్వం ఏర్పాటు చేసి కీలక బాధ్యతలు చేపడతారని చెప్పారు. కూటమి అభ్యర్థుల ప్రభుత్వం ఏర్పాటు తో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. వైసీపీ హయాంలో రాష్ట్రం అన్ని విధాల వెనకబడి ఉందని, అప్పుల పాలు అయ్యిందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా కూటమి పార్టీలకే ఉందని చెప్పారు. వారి వెంట హరి ఓం,గూడూరు సంతోష్, మునయ్య ఇతరులు ఆయన వెంట ఉన్నారు.

## పాత కక్షలతో వ్యక్తి హత్య

**బేతంచర్ల, మే26 (పీపుల్స్ మోటివేషన్):-**



బేతంచర్ల మండల పరిధిలోని రుద్రవరం గ్రామంలో పాత కక్షలతో వ్యక్తిపై కట్టెలతో పిడిబాకి వేట కొడవలితో శనివారం రాత్రి ఘర్షణ జరిగిందని సీఐ తెలిపారు వివరాల మేరకు ఈ గొడవలలో హరి ప్రసాద్,38 సం అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అవడంతో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా హరి ప్రసాద్, చికిత్స పొందుట కోలుకోలేక మృతి చెందాడు మృతుడికి భార్య కల్పన,ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హత్య చేసిన వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, చిన్న మద్దయ్య లపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ ప్రియతమ్ రెడ్డి, తెలిపారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, హత్య జరిగిన రుద్రవరం గ్రామానికి వెళ్లి హత్య చేసిన హంతకులు వివరాలు గ్రామంలో దాడులు పున్నార వృతం కాకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సిఐ ప్రియతమ్ రెడ్డి,నీఆదేశించారు అలాగే గ్రామంలో ప్రజలు సంయమనం పాటించాలని అన్నారు.

## బెంగాల్లో ఇవిఎంకు బిజెపి ట్యాగ్

**కోల్‌కతా :** సార్వత్రిక ఎన్నికల ఆరో విడత పోలింగ్ వేళ ఈవీఎంలకు 'భాజపా ట్యాగ్లు పశ్చిమ బెంగాల్ లో కలకలం సృష్టించాయి. బాంకురా జిల్లాలోని కొన్ని ఓటింగ్ యంత్రాలపై భాజపా అని రాసి ఉందని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. దీనికి కేంద్ర ఎన్నికల సంఘం స్పందిస్తూ ట్యాగ్‌లపై స్పష్టతనిచ్చింది. ఈవీఎంలను ట్యాంపర్ చేసి భాజపా ఓట్ల రిగ్గింగ్‌కు ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పలుమార్లు చెప్పారు. ఈ రోజు అది బయటపడింది. బాంకురా జిల్లాలోని రఘునాథ్‌పుర్‌లో 5 ఈవీఎంలకు భాజపా ట్యాగ్‌లు కన్పించాయి. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు తీసుకోవాలి' అని తృణమూల్ కాంగ్రెస్ 'ఎక్స్'లో ఆరోపించింది. ఈ పోస్ట్‌కు ట్యాగ్‌ల ఫొటోలను జత చేసింది. దీనికి బెంగాల్ ఎన్నికల సంఘం స్పందించింది. 'పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను పెట్టినప్పుడు కామన్ అడ్రస్ ట్యాగ్‌లను ఇస్తుంటాం. వాటిపై అభ్యర్థులు, వారి ఏజెంట్ల సంతకాలు తీసుకుంటాం. మీరు (టీఎంసీ) పేర్కొన్న కేంద్రాల్లో ఈవీఎం, వీవీప్యాట్లను పెట్టిన సమయంలో కేవలం భాజపా అభ్యర్థికి చెందిన ఏజెంట్ మాత్రమే అందుబాటులో ఉన్నారు. అందుకే ఆయన సంతకం తీసుకున్నాం.

# కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది మొబైల్ ఫోన్లు తీసుకొని రావద్దు





- కౌంటింగ్ రోజున రాయలసీమ యూనివర్సిటీ మెయిన్ ఎంట్రెన్స్ గేట్ నుండి వెళ్ళే వాహనాల వివరాలను సెక్యూరిటీ సిబ్బందికి అందచేయండి
- జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డా జి.సృజన

**కర్నూలు, మే 26 (పీపుల్స్ మోటివేషన్):-**

కౌంటింగ్ రోజున రాయలసీమ యూనివర్సిటీ లోకి సాధ్యమైనంత వరకు కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది మొబైల్ ఫోన్లు తీసుకొని రావద్దని, ఒకవేళ తీసుకొని వస్తే మొబైల్ డిపాజిట్ సెంటర్ లలో డిపాజిట్ చేయాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డా జి.సృజన పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలోని కౌంటింగ్ రోజున చేయాల్సిన పార్కింగ్, మొబైల్ డిపాజిట్ సెంటర్, ఫుడ్ కౌంటర్ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఈవిఎమ్ యంత్రాలను భద్రపరచిన లైఫ్ సైన్స్ బ్లాక్ ను, కౌంటింగ్ హాల్ ను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తో కలిసి జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డా జి.సృజన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ రోజున రాయలసీమ యూనివర్సిటీ మెయిన్ ఎంట్రెన్స్ గేట్ నుండి వెళ్ళే వాహనాల వివరాలను మెయిన్ ఎంట్రెన్స్ గేట్ వద్ద ఉండే సెక్యూరిటీ సిబ్బందికి అందచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మెయిన్ ఎంట్రెన్స్ గేట్ నుండి ఎంట్రీ అయ్యే అధికారిక వాహనాల పార్కింగ్ కి, బాయ్స్ హాస్టల్ ఎంట్రెన్స్ గేట్ నుండి ఎంట్రీ అయ్యే వాహనాల పార్కింగ్ కి వేరువేరుగా బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి ఎస్ ఈ ని కలెక్టర్ ఆదేశించారు.. రిసెప్షన్ కౌంటర్ లో ఏ విధంగా అయితే టేబుల్స్ ఏర్పాటు చేశారో అదే విధంగా ప్రతి నియోజకవర్గానికి 1000 స్క్వేర్ ఫీట్ తగ్గకుండా 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు 8 మొబైల్ డిపాజిట్ సెంటర్ లను కౌంటింగ్ సిబ్బందికి, కౌంటింగ్ ఏజెంట్ లకు వేరు వేరుగా ఏర్పాటు చేయాలన్నారు. ఇంజనీరింగ్, లైఫ్ సైన్స్ , లైబ్రరీ బ్లాక్ ల పక్కన మొబైల్ టాయ్లెట్ లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని టిడ్కో ఎస్ఈ ని కలెక్టర్ ఆదేశించారు.. డేటా సెంటర్ వెనుక ఫుడ్ కౌంటర్ ఏర్పాటు చేయాలని ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, ఏజెంట్ లకు వేరువేరుగా కంపార్ట్మెంట్ లు ఏర్పాటు చేయాలని ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది కంపార్ట్మెంట్ లో 10 కౌంటర్ లు, ఏజెంట్ కంపార్ట్మెంట్ లో 6 కౌంటర్ లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని డ్వామా పిడి ని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగబాబు, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ మధుసూదన్ రావు, ఆర్ అండ్ బి ఎస్ఈ నాగరాజు, టీడ్కో ఎస్ఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..సిఐ శ్రీనివాసులు





- కుంకనూరు గ్రామంలో కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించిన సీఐ శ్రీనివాసులు

**దేవనకొండ, మే 26 (పీపుల్స్ మోటివేషన్):-**

కర్నూలు ఎస్పీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జనరల్ ఎలక్షన్స్-2024 జూన్ 4 పోలింగ్ కౌంటింగ్ అసెంబ్లీ మరియు పార్లమెంట్ సందర్భంగా దేవనకొండ సిఐ కే శ్రీనివాసులు అతని సిబ్బంది అందరు కలిసి కార్డెన్ సర్చ్ ఆపరేషన్ దేవనకొండ మండలం కుంకునూరు గ్రామంలో నిర్వహించగా అందులో భాగంగా గ్రామంలోని ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. సిఐ శ్రీనివాసులు మాట్లాడుతూ.. జనరల్ ఎలక్షన్స్ జరిగిన తర్వాత ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండుటకు గాను ఈ సర్చ్ ఆపరేషన్ చేయడం జరిగిందన్నారు. ఈ ఆపరేషన్ లో భాగంగా ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున అందరూ గమనించవలసిన విషయం జనరల్ ఎలక్షన్స్ జరిగిన తర్వాత మరియు ఎలక్షన్ ఫలితాలు వచ్చిన తరువాత ఎవ్వరు కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలలో గ్రామ ప్రజలు మండల ప్రజలు పాల్గొనరాదు ప్రజలందరికీ మీటింగ్ నిర్వహించడం జరిగింది ఏదైనా సమస్య ఉంటే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని అంతేగాని చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదని ప్రజలకు తెలియజేశారు ఎలక్షన్ ఫలితాలు వచ్చిన తర్వాత కూడా ఎటువంటి గొడవల్లో పాల్గొనవద్దని అలా పాల్గొనట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జాబ్ చేస్తూ ప్రజలందరు పోలీసులకు సహకరించాలని తెలియజేశారు ఎవరైనా ఎలక్షన్ నేరాల్లో పాల్గొంటే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలక్షన్ కోడ్ రేపు నెల జూన్ 06 వతేది వరకు వుంటుంది, అంతవరకు సెక్షన్ 144 అమలులో ఉంటుంది, కావున దయచేసి ఎవరు కూడా ఎటువంటి నేరాలలో పాల్గొనరాదన్నారు తెలియజేశారు.

# 27న స్వామివార్ల ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు

- రెండు రోజులపాటు లక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామిల వారికి విశేష పూజా కార్యక్రమాలు
- పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు అన్నదానం, అల్పాహార సౌకర్యం

**శిరివెళ్ల,/రుద్రవరం, మే 26 (పీపుల్స్ మోటివేషన్):-**

రుద్రవరం మండలం కొండమాయపల్లె గ్రామ పంచాయతీ, వెలగల పల్లె గ్రామ పొలిమేరలో వెలిసిన శ్రీ లక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వాసాపుర వెంకటేశ్వర స్వామి దేవస్థానం, మహా త్రిపుర సుందరీ సమేత మానస లింగేశ్వరస్వామి దేవస్థానములు ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 27వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వెల్లాల పుల్లయ్య, వారణిసి గోపీ శర్మ మరియు శివస్వామిలు తెలిపారు. అధ్యక్షులు సింగతల మధుసూదన రెడ్డి, ఉపాధ్యక్షులు ఎల్.వి రంగనాయకులు, కోశాధికారి ఈ కె.వి నరసింహులు, అన్నదాత ఎం. ఓబులయ్య వారు ఆహ్వాన పత్రికలను ప్రజలకు చేరవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2న ఉదయం 7 గంటలకు మహాగణపతి పూజ, 8 గంటలకు మహాలింగార్చన, ఏకాదశవార రుద్రాభిషేకం, ఉదయం 9 గంటలకు అగ్ని ప్రతిష్ట, రుద్ర హెూమం, మధ్యాహ్నం త్రిపుర సుందరీ సమేత మానస లింగేశ్వరస్వామి వారి కళ్యాణ మహెూత్సవ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. సాయంత్రం 4గంటలకు మహిళలకు ఆటల పోటీలు చేపడతామన్నారు. వచ్చిన భక్తులకు ఉదయం, మధ్యాహ్నం అల్పాహారం, భోజన సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. స్వామి, అమ్మవార్ల కళ్యాణం నిర్వహించాలనుకునే భక్తులకు రూ.1500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే 28వ తేదీన కూడా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వివిధ రకాల విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు వేయించాలనుకునే వారు 9703719805, 9494219808 నంబర్లను సంప్రదించాలన్నారు.



తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation


# పదేళ్లలో రూ.8లక్షల కోట్లకు యూజ్డ్ కార్ల మార్కెట్

వినియోగించిన కార్ల (యూజ్డ్ కార్ల)కు ఫైనాన్సింగ్‌లో తమ సంస్థకు ప్రస్తుతం ఐదు శాతం మార్కెట్ వాటా ఉందని కార్స్ 24 ఫౌండర్ గజేంద్ర జంగిడ్ తెలిపారు. కార్స్24 ఫైనాన్సీయల్ సర్వీసెస్ ప్రయివేటు లిమిటెడ్ (సిఎఫ్ఎస్‌పిఎల్) వచ్చే ఐదేళ్లలో రుణాల జారీలో రెట్టింపు వాటా సాధించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో గజేంద్ర మీడియాతో మాట్లాడుతూ.. 2034 నాటికి దేశంలో యూజ్డ్ కార్ల అమ్మకాల మార్కెట్ రూ.8.3 లక్షల కోట్లకు చేరొచ్చని అంచనా వేశారు. ప్రస్తుతం ఇది రూ.2.07 లక్షల కోట్లు (25 బిలియన్ డాలర్లు)గా ఉందన్నారు. ఈ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో 69 శాతం యూజ్డ్ కార్లను ఫైనాన్స్ పద్దతిలోనే కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ ఒక్క నగరంలోనే రూ.497 కోట్లకు మించి రుణాలను పంపిణీ చేశామన్నారు. రుణాల జారీలో ప్రతీ ఏడాది సగటున 30 శాతం వృద్ధిని సాధిస్తున్నామన్నారు. ఐ10, ఐ20, బలెనో మోడళ్లకు ఎక్కువ డిమాండ్ ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఆదాయాలు పెరగడంతో కార్ల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారన్నారు. తెలంగాణలో ప్రతీ నెల 1000 కార్లపైగా అమ్మకాలు చేస్తున్నామన్నారు. దీంతో యూజ్డ్ కార్ల అమ్మకాలు పెరుగుతున్నాయన్నారు. తమ కార్యకలాపాల విస్తరణకు పెట్టుబడులు కొనసాగుతాయన్నారు. దేశంలోని 200 నగరాల్లో కార్యకలాపాలు కలిగి ఉందన్నారు. మరో 50 పట్టణాలకు విస్తరించాలని నిర్దేశించుకున్నామన్నారు. తాము జారీ చేస్తున్న రుణాల్లో సగటు విలువ రూ.5.9





లక్షలుగా ఉందన్నారు. యూజ్డ్ కార్లకు గరిష్టంగా 6 ఏళ్ల కాలపరిమితితో రుణాలు జారీ చేస్తున్నామన్నారు. వడ్డీ రేటు 15 శాతం నుంచి ప్రారంభమవుతుందన్నారు.

# ఏఐ ముప్పుపై మస్క్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ముప్పుపై టెస్లా సీఈవో ఎలోన్ మస్క్ ఆసక్తిర వ్యాఖ్యలు చేశారు. ఏఐ కారణంగా ఉద్యోగం ఓ వ్యాపకంగా మారుతుందన్నారు. ఆ సంక్షోభం నుంచి బయట పడాలంటే అధిక మొత్తంలో డబ్బు ఉండాల్సిందేనని తెలిపారు. రోజురోజుకు కొత్త పుంతలు తొక్కతున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్న ఉద్యోగాలు ఊడిపోతున్నాయని కొందరు అంటుంటే.. ఏఐని సమర్ధిస్తూ కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని అంటున్నారు. ఎవరి అభిప్రాయం ఎలా ఉన్నా.. ప్రపంచం మెచ్చిన వ్యాపార దిగ్గజాలు మాత్రం కృత్తిమ మేధ వినియోగం వల్లే తలెత్తే ముప్పు గురించి ముందే హెచ్చరిస్తున్నారు. ఈ తరుణంలో పారిస్‌లో జరిగిన వివా స్టార్టప్, టెక్ ఈవెంట్‌లో మస్క్ రిమోట్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుశా మనెవ్వరి ఉద్యోగాలు ఉండకపోవచ్చు. ఉద్యోగం ఓ వ్యాపకంలా మారుతుంది. మీకు కావాల్సిన ఉత్పత్తుల్ని, సేవల్ని రోబోట్‌లు అందిస్తాయి. ఈ అనిశ్చితి నుంచి బయటపడాలంటే ఖచ్చితంగా డబ్బులు ఉండాలని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఏఐ సామర్థ్యాలు వేగంగా అభివృద్ధి చెందాయని, రెగ్యులేటర్‌లు, కంపెనీలు, వినియోగదారులు సాంకేతికతను బాధ్యతాయుతంగా ఎలా ఉపయోగించుకోవాలో ఇప్పటికీ తెలుసుకుంటున్నారని ఆయన హైలైట్ చేశారు. ఉద్యోగాలు లేని భవిష్యత్తులో ప్రజలు మానసికంగా సంతృప్తి చెందుతారన్న మస్క్ కంప్యూటర్, రోబోట్‌లు మీ కంటే మెరుగ్గా ప్రతిదీ చేయగలిగితే మీ జీవితానికి అర్థం ఉందా? అని ప్రశ్నించారు.



## హిండెన్‌బర్గ్ దెబ్బ నుంచి కోలుకున్న అదానీ ఎంటర్‌ప్రైజెస్




అదానీ గ్రూప్‌పై అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ 2022 జనవరిలో విడుదల చేసిన నివేదిక దేశంలో పెద్ద దుమారమే లేపింది. అదానీ గ్రూప్‌పై చేసిన ఆరోపణలతో ఆ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్లన్నీ కుప్పకూలాయి.ఒక దశలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 4వేల మార్క్‌ను కూడా అదిగమించింది. హిండెన్‌బర్గ్ నివేదిక తరువాత 52 వారాల కనిష్టానికి పడిపోయింది. ఈ నివేదిక తరువాత అదానీ గ్రూప్ అనేక నివారణ చర్యలు తీసుకుంది. దీంతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లన్నీ క్రమంగా కోలుకుంటూ వస్తున్నాయి. శుక్రవారంనాడు అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు రాణించడంతో ఇంట్రాడేలో రూ.3,449 వద్ద హిండెన్‌బర్గ్ నివేదికకు పూర్వం ఉన్న స్థితిని అందుకుంది. అదానీ గ్రూప్ పై హిండెన్‌బర్గ్ 2022 జనవరిలో వెల్లడించిన నివేదికలో అదానీ గ్రూప్ కంపెనీలు చాలా సంవత్సరాలుగా స్టాక్ అవకతవకలకు పాల్పడుతున్నాయని, అకౌంటింగ్ మోసాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించింది. షెల్ కంపెనీలు పెట్టి మనీలాండరింగ్‌కు పన్నుల ఎగవేతకు పాల్పడుతున్నట్లు పేర్కొంది. ఈ ఆరోపణలు స్టాక్ మార్కెట్లపైనా ప్రభావం చూపించాయి. రాజకీయంగా పెద్ద దుమారమే చెలరేగింది. 20వేల కోట్ల ఫాలోఆన్ ఐపీఓను అదానీ ఎంటర్‌ప్రైజెస్ వాయిదా వేసుకుంది. గత సంవత్సరం ఫిబ్రవరి3న అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు ధర 1,07.45 వద్ద కనిష్టానికి చేరింది. అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ ఆరోపణల తరువాత ఈ కేసు సుప్రీం కోర్టుకు చేరింది. కోర్టు దీనిపై నిపుణుల కమిటీ నియమించింది. సెబీని దర్యాప్తు చేయాలని ఆదేశించింది. అదానీ గ్రూప్ షేర్లలో అనుమానిత లావాదేవీలు ఏమీ లభించలేదని నిపుణుల కమిటీ తెలిపింది. సెబీ కూడా కోర్టుకు నివేదిక సమర్పించింది. మరో రెండు అంశాలపై విచారణ పూర్తి కావాల్సి ఉందని పేర్కొంది. తీవ్రంగా నష్టపోయిన అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు వేగంగా కోలుకున్నాయి. అమెరికా బ్రోకరేజీ సంస్థల మద్దతు, జీక్యూజీ భారీ పెట్టుబడి పెట్టడంతో అదానీ ఎంటర్‌ప్రైజెస్ కోలుకుంది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరెప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్, అమెరికాకు చెందిన ఒక ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ అదానీ గ్రూప్‌పై ఆరోపణలు చేసినప్పటికీ అవి పెద్దగా ప్రభావం చూపించలేకపోయాయి. బీఎస్ఈ ఇండెక్స్‌లో విప్రో స్థానంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ చేరవచ్చున్న వార్తలు రావడంతో గురు, శుక్రవారాల్లో ఈ షేరు మరింత బలపడింది. 16 నెలలుగా చూస్తే ఈ షేరు మూడు రెట్లు పెరిగింది. అదానీ లిస్టెడ్ కంపెనీల షేర్లు అన్నీ కూడా హిండెన్‌బర్గ్ దెబ్బ నుంచి దాదాపు కోలుకున్నాయి. గడిచిన నెలలోరోజుల్లోనే అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు ధర 12 శాతం పెరిగింది. శుక్రవారం నాటికి అదానీ ఎంటర్‌ప్రైజెస్ మార్కెట్ విలువ 3,92,473.89 కోట్లుగా ఉంది.

## నిస్సాన్ కార్ల ప్రియులకు శుభవార్త..




భారతదేశంలో కార్లను వినియోగించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. ఈ నేపథ్యంలో అన్ని కంపెనీలు సరికొత్త కార్లను ఎప్పటికప్పుడు రిలీజ్ చేస్తున్నాయి. తాజాగా ప్రముఖ కార్ల తయారీ సంస్థ నిస్సాన్ గత సంవత్సరం విడుదల చేసిన మెగ్నెట్ జిజా ఎడిషన్ విజయవంతమైన తర్వాత ప్రస్తుతం జిజా సీవీటీ వేరియంట్‌ను లాంచ్ చేసింది. ఈ ఎస్‌యూవీ లాంచ్ చేస్తూ కంపెనీ మాగ్నెట్ గెజా ఎడిషన్ 'జపనీస్ థియేటర్, దాని వ్యక్తీకరణ మ్యూజికల్ థీమ్స్' నుండి ప్రేరణ పొందిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో మెగ్నెజీ జిజా సీవీటీ గురించి వివరాలను తెలుసుకుందాం.మెగ్నెట్ జిజా ఎడిషన్‌కు సంబంధించిన ఒక సంవత్సరం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కంపెనీ మెగ్నెట్ జిజా సీవీటీ ఎడిషన్‌ను రూ. 8.94 లక్షల (ఎక్స్-షోరూమ్) నుండి ప్రారంభించింది ఈ వేరియంట్ సాధారణంగా మాగ్నెట్ మ్యూజిక్ ఎడిషన్‌గా పేర్కొంటున్నారు. అలాగే ఈ కంపెనీ ఈ ఎస్‌యూవీ పెద్ద ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్‌తో పాటు ప్రీమియం సౌండ్ సిస్టమ్‌తో కూడిన మ్యూజిక్ ప్యాకేజీతో అమర్చింది. ఈ లాంచ్ గురించి నిస్సాన్ మోటార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ వత్స మాట్లాడుతూ గత సంవత్సరం జిజా స్పెషల్ ఎడిషన్‌కు సంబంధించిన అద్భుతమైన విజయాన్ని అనుసరించి మాగ్నెట్‌కు సంబంధించిన సరికొత్త వేరియంట్‌ను పరిచయం చేస్తున్నందుకు సంతోషిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రీమియం ఫీచర్లను అందించడానికి మార్కెట్లోని కస్టమర్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఈ కారును లాంచ్ చేశామని వివరించారు. మెగ్నెట్ జీజా సీవీటీ 1.0 ఎల్ టర్బో పెట్రోల్ ఇంజన్ ఎంపికతో మాత్రమే అందిస్తున్నారు. ఇది 98.63 బీహెచ్‌పీ, 160 ఎన్ఎం టార్క్‌ను విడుదల చేస్తుంది. ఈ ప్రత్యేక ఎడిషన్ కారులో గెజా బ్యాడ్జింగ్, లేత గోధుమరంగు సీటు అప్హోల్స్టరీ, యాంబియంట్ లైటింగ్, జేబీఎల్ సౌండ్ సిస్టమ్, మార్గదర్శకాలతో వెనుక కెమెరా, వైర్లెస్ యాపిల్ కార్ ప్లే, ఆండ్రాయిడ్ ఆటో, 9 అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్‌తో వస్తుంది. మెగ్నెట్ జీజా సీవీటీ స్పెషల్ ఎడిషన్ అనేది మార్కెట్లో ఏ ఇతర ఉత్పత్తి ఆఫర్ చేయని ఫీచర్లతో ఇంత పోటీ ధరలో లభించే ఏకైక సీవీటీ టర్బోగా నిలుస్తుంది.


## తక్కువ ధరకే అమ్మేశాను..



దశాబ్దం క్రితం భారత్‌లో వ్యాపారం చేయడం కష్టంగా ఉండేది. ఇప్పుడు పరిస్థితి వేరు. ఈ రోజు మీ వ్యాపారంపై ఎవరూ ఒత్తిడి చేయరు. అయితే ఎయిర్‌సెల్ వ్యవస్థాపకుడు చిన్నకన్నన్ శివశంకరన్ యూపీఏ హయాంలోని రోజులను గుర్తు చేసుకుంటూ..ఆ రోజులు వేరేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఎయిర్‌సెల్ కంపెనీని (ఎయిర్‌సెల్) అతి తక్కువ డబ్బుకు బలవంతంగా అమ్మేశారని వాపోయాడు. ఎయిర్‌సెల్ భారతదేశంలోని ప్రముఖ టెలికమ్యూనికేషన్ సర్వీస్ ప్రొవైడర్‌లలో ఒకటి. ఎయిర్‌సెల్ 2006లో మాక్సిస్ బెర్హాద్‌కు విక్రయించబడింది. ఎయిర్‌సెల్ వ్యవస్థాపకుడు సి శివశంకరన్ కంపెనీని చిన్న మొత్తానికి విక్రయించడాన్ని అప్పటి రాజకీయ నాయకులు తప్పుబట్టారు. 2006లో సింహళ తమిళ, మలేషియా పౌరుడు ఆనంద్ కృష్ణన్‌కు చెందిన మ్యాక్సిస్ బెర్హాద్ కంపెనీ ఎయిర్‌సెల్ వాటాను కొనుగోలు చేసింది. 74 శాతం వాటా కొనుగోలు చేశారు. ఈ డీల్ లో శివశంకరన్ కు రూ.3,400 కోట్లు మాత్రమే దక్కాయి. కంపెనీని తక్కువ ధరకు విక్రయించేందుకు రాజకీయ నాయకులు కుట్ర పన్నారు. నేను కంపెనీని ఏటీ అండ్ టీకి అమ్మి ఉంటే నాకు ఎనిమిది బిలియన్ డాలర్లు వచ్చేవని చిన్నకన్నన్ శివశంకర్ ఆరోపిస్తున్నారు.

అప్పట్లో డాలర్ విలువ రూ.43గా ఉన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఆ డీల్ ద్వారా కనీసం రూ.35 వేల నుంచి రూ. కేవలం రూ.3,400లకే కంపెనీని విక్రయించడంపై విచారం వ్యక్తం చేశారు. అంటే శాతం. 10 ధరకు కంపెనీని విక్రయించాల్సి ఉంది. అప్పట్లో యూపీఏ ప్రభుత్వ హయాంలో వృద్ధి చెందింది. 'నేటి భారతదేశం అప్పటిలా లేదు. ఈ రోజు మిమ్మల్ని ఎవరూ ఒత్తిడి చేయరు. వ్యవస్థాపకులుగా మారిన వారు కంపెనీని ఫలానా వ్యక్తికి విక్రయించాలని ఒత్తిడి తెచ్చారు' అని శివశంకరన్ చెప్పారు.ఈ రోజు ఎవరి ఒత్తిడి లేకుండా వ్యాపారాన్ని నిర్మించగలరు. నేడు సరళీకృత భారతదేశం. బలవంతంగా కంపెనీని అమ్మేశానన్న బాధ అతనికి లేదు. అయితే, ఎనిమిది బిలియన్ డాలర్లు ఆఫర్ చేసిన వారికి కంపెనీని విక్రయించేందుకు అనుమతించాలనేది నా ఫిర్యాదు అని చిన్నకన్నన్ శివశంకరన్ చెప్పారు.ఎయిర్‌సెల్‌ను అతి తక్కువ ధరకు కొనుగోలు చేసిన మ్యాక్సిస్ కంపెనీ యజమాని ఆనంద్ కృష్ణన్ దానిని బాగా నడిపించడంలో విఫలమయ్యాడు. అతను 45 బిలియన్ డాలర్లను కోల్పోయాడు. 2018లో ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ కంపెనీ మూతపడింది.

## చైనాను భారత్ ఎలా అధిగమిస్తుంది?



చైనా ఇప్పుడు అమెరికాలాగే ప్రపంచ అగ్రరాజ్యంగా మారింది. ప్రపంచంలోని ప్రముఖ పవర్‌హౌస్‌లలో ఒకటి. భారత్ ఇప్పుడు పోటీలో పాల్గొనేందుకు ఉవ్విళ్లూరుతోంది. చైనా జీడీపీ భారత్ కంటే రెండున్నర రెట్లు ఎక్కువ. సైన్స్, టెక్నాలజీ, పరిశోధన ముందంజలో ఉన్నాయి. అమెరికా కూడా చైనాను గట్టి పోటీదారుగా చూస్తోంది. భారత్ చైనాను అధిగమించగలదా అన్నది ప్రశ్న. ఇన్ఫోసిస్ చైర్మన్ ఎన్ఆర్ నారాయణమూర్తి అభిప్రాయం ప్రకారం.. చైనా ఆర్థిక వ్యవస్థను అధిగమించే సత్తా భారత్‌కు ఉంది. ఎకనామిక్ టైమ్స్ వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, పారిశ్రామిక రంగంలో చైనాను అధిగమించడానికి వీలు కల్పించే కొన్ని అంశాలను ఆయన వెల్లడించారు. పారిశ్రామిక రంగంలో భారత్ చైనాను ఓడించగలదని పేర్కొంటూ, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఈ కింది అంశాలను పేర్కొన్నాడు. పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వ్యాపార వాతావరణం కల్పించాలి. ప్రజలకు ఆదాయం పెరగాలి. ప్రతి సంవత్సరం లక్షలాది ఉద్యోగాలు సృష్టించాలి. మానవ వనరుల ఉత్పాదకతను పెంచడానికి జెనరిక్ %ూ×% తగినంతగా ఉపయోగించబడాలి'పారిశ్రామికవేత్తలు, పారిశ్రామికవేత్తలకు అవాంతరాలు లేని వాతావరణాన్ని అందించాలి. వారి వృద్ధిని సులభతరం చేయడానికి, వేగవంతం చేయడానికి విధానాలను రూపొందించాలి. ఇది సాధ్యమైతే చైనాతో సరిపెట్టుకోవడమే కాకుండా అధిగమించగలం అని ఎన్.ఆర్. నారాయణమూర్తి.చైనా గత నాలుగు నుండి ఐదు దశాబ్దాలుగా సరళీకరణ, ప్రపంచీకరణ విధానాన్ని అమలు చేసింది. నిరంతరం అధిక స్థాయి ఆర్థిక వృద్ధిని సాధించింది. ఫలితంగా ఇది యునైటెడ్ స్టేట్స్ తర్వాత అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. భారతదేశం 1990లలో ప్రపంచీకరణకు తెరతీసింది. స్వేచ్ఛా మార్కెట్ విధానాన్ని అవలంబించింది. అప్పటి నుంచి బాగా పెరిగింది. అయితే పోటీలో భారత్ కంటే చైనా చాలా ముందుంది. చైనా అన్ని రంగాల్లో అద్వితీయ విజయాలు సాధించింది. రాబోయే సంవత్సరాల్లో చైనా ఆర్థిక వృద్ధి మందగించగా, భారతదేశం వృద్ధి చెందుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. ఈ దశాబ్దం చివరి నాటికి, భారతదేశ వార్షిక జీడీపీ వృద్ధి శాతం 9కి చేరుకోవచ్చు. చైనా వృద్ధి రేటు 3.5 శాతానికి పడిపోవచ్చు. రానున్న సంవత్సరాల్లో ఇదే జోరు కొనసాగితే చైనాను భారత్ అధిగమించగలదు.

## పర్సనలైజ్డ్ మెడిసిన్‌కు డిమాండ్

పర్సనలైజ్డ్ మెడిసిన్ (వ్యక్తిగతీకరించిన ఔషధం)లకు డిమాండ్ పెరుగుతుందని డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీ ఎపిఐ అండ్ సర్వీసెస్ సీఈఓ దీపక్ సప్రా అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన డిఎక్స్ఇఎం 2024 సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా 15 నుండి 20 కొత్త పర్సనలైజ్డ్ మందులు రావొచ్చున్నారు. ఈ విషయంలో భారత్ కూడా అత్యంత అభివద్ధి చెందిన దేశాలతో సమానంగా పురోగమిస్తోందన్నారు. కొత్త ఔషధ ఆవిష్కరణకు 10 నుండి 15 సంవత్సరాలు అవసరం ఉంటుందన్నారు. ఇందుకోసం వేల కోట్ల రూపాయలు వ్యయం చేయాల్సి ఉంటుందన్నారు. టెక్నాలజీతో ఆధారితమైన ఇన్నోవేషన్ సహకారం వల్ల డ్రగ్స్‌ని వేగంగా, తక్కువ ఖర్చుతో కనుగొనడానికి అవకాశాలు మెరుగుపడ్డాయన్నారు. భారత కంపెనీలు తమ లాభాల్లోంచి కేవలం 0.8 శాతం మాత్రమే ఆర్అండ్‌డి కోసం ఖర్చు చేస్తున్నాయని.. అదే దక్షిణ కొరియాలో 5.2 శాతం వ్యయం చేస్తున్నాయన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation






# లవ్‌మీలో దర్శకుడి తడబాటు

**సినిమా కథనంలో కానరాని వైవిధ్యం**

దిల్‌రాజు కుటుంబం నుంచి వచ్చి హీరోగా తెరకు పరిచయమయ్యారు ఆశిష్. తొలి ప్రయత్నంలో 'రౌడీ బాయ్స్'తో మిశ్రమ ఫలితాన్ని అందుకున్న ఆయన.. ఇప్పుడు రెండో ప్రయత్నంలో 'లవ్ మీ'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. 'బేబీ'తో మెప్పించిన వైష్ణవి చైతన్య నాయికగా నటించడం.. టీజర్, ట్రైలర్లకు ఆదరణ దక్కడం.. ప్రేక్షకుల్లో దీనిపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ర్జున్ (ఆశిష్)కు దేవుడు, దెయ్యాలపై అసలు నమ్మకం ఉండదు. ఎక్కడైనా దెయ్యాలున్నాయని తెలిస్తే చాలు అక్కడికి వెళ్లి.. అవి లేవని సాక్ష్యాధారాలతో సహా నిరూపిస్తుంటాడు. ఆ వీడియోలన్నింటినీ తన యూట్యూబ్ ఛానెల్‌లో పెట్టి డబ్బులు సంపాదిస్తుంటాడు. ఈ విషయంలో అతనికి తన సోదరుడు ప్రతాప్ (రవికృష్ణ) కూడా సహాయ పడుతుంటాడు. ఈ క్రమంలో ఓసారి అర్జున్‌కు ప్రతాప్ ప్రియురాలు ప్రియ (వైష్ణవి చైతన్య) ద్వారా దివ్యవతి అనే దెయ్యం గురించి తెలుస్తుంది. తెలంగాణ - కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న ఓ ఊరిలోని పాడుబడ్డ అపార్ట్‌మెంట్‌లో ఆ దెయ్యం తిరుగుతోందని.. ఆమె గురించి తెలుసుకోవాలని ప్రయత్నించిన చాలా మందిని హతమార్చిందని తెలుసుకుంటాడు. ఆ కథ విన్నాక అర్జున్ ఎలాగైనా ఆ దెయ్యాన్ని తన ప్రేమలో పడేయాలని నిర్ణయించుకుని అక్కడికి వెళ్తాడు. మరి ఆ తర్వాత తనెలాంటి పరిణామాల్ని ఎదుర్కొన్నాడు? దివ్యవతి కథేంటి? ఆమెకు గతంలో కనిపించకుండా పోయిన పల్లవి, నూర్, ఛరిష్మాలకు ఉన్న సంబంధం ఏంటి? అసలు దివ్యవతి కథను అర్జున్ దగ్గరకు ప్రియ ఎందుకు చేర్చింది? అన్నది సినిమా కథ. విభిన్నమైన పాయింట్‌తో తెరకెక్కిన రొమాంటిక్ హారర్ థ్రిల్లర్. ఓ యువకుడు దెయ్యాన్ని ప్రేమలో దింపాలని ప్రయత్నిస్తే ఎలాంటి పరిణామాలెదురయ్యాయన్నది క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. ఇలాంటి కథ విషయంలో కొత్త దర్శకుడు అరుణ్ భీమవరపు అనుభవం సరిపోలేదనిపిస్తుంది. తాను రాసుకున్న కథలో కొత్తదనమున్నా.. దాన్ని లాజికల్‌గా ప్రేక్షకులు కన్విన్స్ అయ్యేలా చెప్పడంలో తడబడ్డారు. దీనికి తోడు సినిమాలో ట్విస్ట్‌లా సెట్ చేసి పెట్టుకున్న అమ్మాయిల మిస్సింగ్ పాయింట్ కథను, ప్రేక్షకుల్ని పూర్తిగా గందరగోళానికి గురి చేసింది. అర్జున్ చిన్నతనంలో తన ఊరిలో జరిగిన ఓ అసాధారణమైన మిస్టరీని చూపిస్తూ కథను ఆరంభించిన తీరు ఆసక్తిరేకెత్తిస్తుంది. ఇక ఆ తర్వాత దెయ్యాలు లేవని నిరూపించడంలో అర్జున్ శక్తిసామర్థ్యాల్ని పరిచయం చేస్తూ ఓ హారర్ ఎపిసోడ్ తెరపైకి వస్తుంది. కానీ, అదంత థ్రిల్లింగ్‌గా అనిపించదు. అర్జున్ ప్రపంచం.. ప్రతాప్‌తో కలిసి చేసే ప్రయాణం.. ప్రియ పరిచయ సన్నివేశాలు.. అన్నీ సాదాసీదాగా అనిపిస్తాయి. ప్రియ.. దివ్యవతి కథను అర్జున్‌కు పరిచయం చేసినప్పటి నుంచే అసలు కథ మొదలవుతుంది. ఆ దెయ్యాన్ని ప్రేమిస్తానంటూ అర్జున్ ఆమె అపార్టుమెంట్‌కు వెళ్లడం.. ఆరంభంలో అక్కడ తనకు ఎదురయ్యే అనుభవాలు.. అక్కడి ప్రపంచం.. అన్నీ థ్రిల్లింగ్‌గా అనిపిస్తాయి. దీనికి తగ్గట్లుగానే ద్వితీయార్ధంపై అంచనాలు పెంచేలా విరామ సన్నివేశాల్ని తీర్చిదిద్దుకున్న తీరు బాగుంది. దివ్యవతి దెయ్యం కాదు బతికే ఉందని నిరూపించడం కోసం అర్జున్ చేసే అన్వేషణతో ద్వితీయార్ధం ఆసక్తికరంగా మొదలవుతుంది. ఈ క్రమంలోనే కనిపించకుండా పోయిన ముగ్గురు అమ్మాయిల ఎపిసోడ్ తెరపైకి వస్తుంది. ఇక ప్రియ పాత్రలోని ట్విస్ట్ ఊహలకు అందేదే అయినా అర్జున్ పాత్ర వెనకున్న చిన్న మిస్టరీ కాస్త సర్‌ప్రైజ్‌కు గురి చేస్తుంది. రెండో భాగానికి లీడ్ ఇస్తూ క్లైమాక్స్‌లో సెట్ చేసిన ట్విస్ట్ థ్రిల్లింగ్‌గానే ఉంది. దర్శకుడు అరుణ్ రాసుకున్న కథలో కొత్తదనమున్నా.. దాన్ని అంతే ఆసక్తికరంగా తెరపైకి తీసుకురాలేకపోయాడు. ఫస్టాఫ్‌లో కొంత వరకు కథ అక్కడక్కడే తిరిగిన అనుభూతి కలుగుతుంది. సెకండాఫ్‌లో బాగా కంగాళిగా తయారైంది. ఎం.ఎం.కీరవాణి నేపథ్య సంగీతం సినిమాకి ఆకర్షణ. పాటలు మరీ గుర్తుంచుకునేలా లేవు. ఈ కథకు తగ్గట్లుగా పిసి శ్రీరామ్ డార్క్ టోన్డ్ సినిమాటోగ్రఫీ చక్కగా కుదిరింది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి.



# దర్శకుడు విజయభాస్కర్ రంగప్రవేశం

**కొడుకు శ్రీకమల్ హీరోగా ఉషాపరిణయం మూవీ**

టాలీవుడ్ సీనియర్ దర్శకుడు కే. విజయ్ భాస్కర్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. 'నువ్వే కావాలి', 'మన్మథుడు', 'నువ్వు నాకు నచ్చావ్', 'జై చిరంజీవ' లాంటి ఆల్‌టైమ్ ఫ్యామిలీ బ్లాక్‌బస్టర్‌లను టాలీవుడ్‌కు అందించాడు. ఇక చాలారోజులుగా సినిమాలకు దూరంగా ఉంటున్న విజయ్ భాస్కర్ తన కొడుకు కోసం మళ్ళీ మెగాఫోన్ పట్టాడు. ఆయన దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'ఉషాపరిణయం' లవ్ ఈజ్ బ్యూటిఫుల్ అనేది ఉప శీర్షిక. ఈ సినిమాలో విజయ్ భాస్కర్ కొడుకు శ్రీకమల్ హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటికే మూవీకి సంబంధించి ఫస్ట్ లుక్ విడుదల చేసిన చిత్రబృందం తాజాగా టీజర్ వదిలింది. ఇక ఈ టీజర్ గమనిస్తే.. విజయ్ భాస్కర్ చాలా ఏండ్ల తర్వాత మళ్లీ ఓ సరికొత్త ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో రాబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ సినిమాలో శ్రీకమల్‌తో పాటు తాన్వీ ఆకాంక్ష, సూర్య, అలీ, వెన్నెలకిషోర్, శివాజీరాజా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాలో దర్శకత్వంతో పాటు నిర్మాణ బాధ్యతల్ని కూడా విజయ్ భాస్కర్ చేపడుతున్నారు.

# మూర్తిగారి కలలు

**డీజే కావాలని కలలుకనే మ్యూజిక్ షాప్ యజమానిగా అజయ్‌ఘోష్, ఆ లక్ష్యాన్ని సాధించడంలో అతని సాయం చేసే ఇన్‌స్పైరింగ్ రోల్‌లో చాందిని చౌదరి నటిస్తున్న ఎమోషనల్ డ్రామా 'మ్యూజిక్‌షాప్ మూర్తి'. శివ పాలడుగు దర్శకుడు. హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మాతలు. ఈ సినిమా జూన్ 14న విడుదల కానుంది. ఈ విషయాన్ని నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఇంకో మూడు వారాల్లో ప్రేక్షకులకు అద్భుతమైన ఎమోషనల్ ట్రీట్ ఇవ్వబోతున్నామని, ఇది సకుటుంబంగా చూడదగ్గ ఫ్యామిలీ ఎంటైర్టైనర్ అని నిర్మాతలు తెలిపారు. అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, బేబీ, డి.జె.టిల్లు చిత్రాలను పంపిణీ చేసిన ధీరజ్ మొగిలినేని ఎంటైర్టైన్‌మెంట్ సంస్థ ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. ఈ చిత్రానికి కెమెరా: శ్రీనివాస్ బెజుగం, సంగీతం: పవన్.**



Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com